అంబరాన్నంటిన దసరా సంబురం

• దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో పూజలు • కనులపండువగా శోభాయాత్రలు

భద్రాచలంలో : మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు, అశ్వారావుపేటలో ఊరేగింపు

అశ్వారావుపేట టౌన్ : అమ్మవారి ఊరేగింపులో మహిళలు బతుకమ్మ సందడి

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా దసరా వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయమే ప్రజలు తమ ఇళ్లల్లో, ఆలయాల్లో పూజలు చేసిన తర్వాత ఆయుధ పూజలు నిర్వహించారు. పిండి వంటలు తయారు చేసుకొని ఇంటిల్లిపాది సంతోషంగా గడిపారు. సాయంత్రం అందరికీ నచ్చిన రామలీలా(రావణ సంహారం) ఘట్టాన్ని కనులారా తిలకించారు. రాత్రి 12 గంటల వరకు వేడుకల్లో చిన్నాపెద్దా అంతా కేరింతలు కొట్టారు. జమ్మిచెట్టుకు పూజలు చేసి జమ్మి ఆకులను ఇళ్లకు తెచ్చుకున్నారు. డప్పు చప్పుళ్లు.. యువత కోలాటాలు.. చిన్నారుల కేరింతలు.. అదిరేటి డీజే సౌండ్స్.. ఇలా ఆదివారం దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్రలు కనులపండువగా సాగాయి. తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకుని తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన దుర్గమ్మతల్లికి భక్తులు భక్తిశ్రద్ధలతో నీళ్లు పోసి మొక్కుకున్నారు. టెంకాయలు, గాజులు సమర్పించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

– నమస్తే నెట్‌వర్క్

చుంచుపల్లి: భక్తుల పూజలు, రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు

కొత్తగూడెంటౌన్ : అమ్మవారు

అన్నపురెడ్డిపల్లి : కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

టేకులపల్లిలో శోభాయాత్ర

ఇల్లెందురూరల్ : ఇల్లెందులో జబర్దస్త్ టీం ప్రదర్శన

సారపాక వర్తకసంఘం ఆధ్వర్యంలో హోమం

చర్ల : రావణ దహన ఘట్టం

దమ్మపేటలో నిమజ్జనానికి వెళ్తున్న అమ్మవార్లు

చండ్రుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజ

దుమ్ముగూడెం : సాయిబాబా ఆలయంలో పూజలు

అశ్వారావుపేట టౌన్ : అమ్మవారి ఊరేగింపు

దమ్మపేట : పేరంటాల చెరువులో బతుకమ్మల నిమజ్జనం

పాల్వంచ రూరల్: పెద్దమ్మ గుడిలో అన్నదానం

పాల్వంచ రూరల్: పెద్దమ్మగుడిలో సత్యనారాయణ వ్రతం

అశ్వారావుపేట రూరల్ : కొండరెడ్ల మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తండ్రిని చంపిన తనయుడు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఘాతుకం

దమ్మపేట రూరల్, అక్టోబర్ 13 : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తండ్రిని ఓ కొడుకు హత్యచేసిన ఘటన దమ్మపేట మండలం వడ్లగూడెంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లగూడెం గ్రామానికి చెందిన కంభంపాటి క్రిష్ణయ్య(75) కుమారుడు సత్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మద్యం సేవించడానికి సత్యనారాయణ తన తండ్రి క్రిష్ణయ్యను డబ్బులు అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో కోపోద్రేకుడైన సత్యనారాయణ తండ్రి పీకను కత్తితో కోశాడు. స్థానికుల సాయంతో క్రిష్ణయ్యను తొలుత సత్తుపల్లి ఆసుపత్రికి తెసుకెళ్లి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని బాలికలకు గాయాలు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 13: బైక్ ఢీకొనడంతో ఇద్దరు బాలికలకు గాయాలయ్యాయి. మండలంలోని కేశవాపురంలో అక్కాచెల్లెళ్లయిన వైష్ణవి, ధనశ్రీ కలిసి తమ ఇంటి ముందు శనివారం ఆడుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన సూర్యప్రతాప్ వేగంగా నడుపుతున్న బైక్, ఈ ఇద్దరు బాలికలను ఢీకొంది. వైష్ణవికి తీవ్రంగా, ధనశ్రీకి స్వల్పంగా గాయాలయ్యాయి. వారి తల్లి బానోత్ నాను ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

పినపాక (కరకగూడెం), అక్టోబర్ 13: వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో, దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెందారు. మండలంలోని రేగళ్ల పంచాయతీ మద్దెలగూడెం గ్రామ సమీపంలో శనివారం ఈ దర్ఘటన జరిగింది. కరకగూడెం ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాలు.. రేగళ్ల వలస ఆదివాసీ గ్రామస్తుడు మడకం భద్రు(60), ఈమ్లా దేవ (27) కలిసి కిరాణా సరుకుల కోసం భట్టుపల్లి గ్రామం వెళ్తున్నారు. వేగంగా వెళ్తున్న వారి వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. వారిద్దరూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. భద్రు భార్య జోగమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఎన్‌కౌంటర్ మృతులు 31 మంది కాదు..

మొత్తం 35 మంది మృతిచెందారంటూ మావోయిస్టుల లేఖ విడుదల

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 13: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా మావోయిస్టు పార్టీ తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ పేరుతో తాజాగా విడుదలైన లేఖ కలకలం సృష్టిస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ – దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లోని ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని నెండూర్ – తులతులీ గ్రామల మధ్య గల అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు, భద్రతాదళాలకు మధ్య ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా మరికొందరు గాయపడినట్లు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. కాగా, ఈ ఘటనలో మొత్తం 35 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు చెబుతూ వారి పేర్లతో కూడిన లేఖను మావోయిస్టు పార్టీ తాజాగా విడుదల చేసింది. ఈ ఘటనపై నారాయణ్‌పూర్ ఎస్పీ ప్రభాత్ కుమార్ స్పందిస్తూ.. ఎన్‌కౌంటర్ ఘటనలో మొత్తం 31 మంది మృతిచెందినట్లు అధికారికంగా వెల్లడించినప్పటికీ.. ఈ ఎదురుకాల్పుల్లో మరికొందరు మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. గాయపడిన వారిలో కొందరిని మావోయిస్టులు వారితోపాటు తీసుకెళ్లారని, వారిలో మరికొందరు మృతిచెంది ఉంటారని, ఇంకొందరు తీవ్రంగా గాయపడిన మావోయిస్టుల పరిస్థితి సైతం విషమంగా ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

అశ్వారావుపేట, అక్టోబర్ 13: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్ర నుంచి విశాఖపట్నం వెళుతున్న లారీ, శనివారం అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం గ్రామ సమీపంలో ముందు వెళుతున్న లారీని ఢీకొంది. ఢీకొట్టిన లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. ఈ లారీ డ్రైవర్ ప్రమోద్ కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు.జేసీబీ, గ్యాస్ కట్టర్ల సాయంతో ఆయనను సీఐ కరుణాకర్ తదితరులు రెండు గంటలపాటు శ్రమించి బయటకు తీశారు. ఆ డ్రైవర్ రెండు కాళ్లు విరిగాయి. ఆయనను కొత్తగూడెం ఆసుపత్రికి పోలీసులు తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై యయాతి రాజు తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

గంజాయి కేసులో ఇరికించారంటూ సెల్ఫీ వీడియో

ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

సారపాక, అక్టోబర్ 13: బూర్గంపహాడ్ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన ఓ కానిస్టేబుల్ కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సికింద్రాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన భూక్యా సాగర్ (34) 2013 బ్యాచ్ చెందిన కానిస్టేబుల్. 8 నెలల క్రితం వరకు భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. ఆ సమయంలో బూర్గంపహాడ్ స్టేషన్‌లో గంజాయి మాయమైన ఘటనలో సాగర్‌కు సంబంధం ఉందంటూ అప్పటి పోలీసులు అధికారులు కేసు పెట్టడంతో జైలుకు వెళ్లాడు. అయితే ఆ సమయంలో పోలీసు ఉన్నతాధికారులు సాగర్‌ను సస్పెండ్ చేశారు. అయితే తాజాగా దసరా రోజున శనివారం ఉదయం 12 గంటల సమయంలో స్వగ్రామమైన ఏన్కూరులో కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు తొలుత ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లో ఓ ప్రముఖ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు.

సెల్ఫీ వీడియో..

ఇదిలా ఉండగా తన ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను సాగర్ ఓ సెల్ఫీ వీడియోలో వివరించారు. బూర్గంపహాడ్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో అప్పటి అధికారులు.. బూర్గంపహాడ్‌కు చెందిన మరో వ్యక్తి ద్వారా బయటి వ్యక్తులతో గంజాయి అమ్మించేవారని ఆ వీడియోలో సాగర్ ఆరోపించారు. బయటి వ్యక్తుల ద్వారా గంజాయి విక్రయించేవారని, ఈ కార్యకలాపాలకు తన ఫోన్‌ను వాడుతూ తనను ఆ కేసులో ఇరికించారని, తన సస్పెన్షన్‌కు కారణమయ్యారని అందులో ఆరోపించారు. అందువల్లనే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సెల్ఫీ వీడియో జిల్లాలో వైరల్ అయింది. కాగా, 'రే వంతన్నా.. నా భార్యా పిల్లలకు, అమ్మానాన్నకు న్యాయం చేయండన్నా. ఈ కేసు విచారణ జరిపించండన్నా.' అంటూ చికిత్స పొందుతూ తీసిన మరో వీడియో కూడా ఆదివారం సాయంత్రం విడుదలైంది.

ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

బూర్గంపహాడ్ స్టేషన్‌లో పనిచేసిన భూక్యా సాగర్ పురుగుమందు తాగి మృతిచెందడంతో ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైనట్లు ఏన్కూరు ఎస్సై రఫీ తెలిపారు. తన కుమారుడు సాగర్ బూర్గంపహాడ్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసేవాడని; ఆ సమయంలో పనిచేసిన అధికారులు సంతోశ్, రాజ్ కుమార్, సత్యనారాయణ సహా మరో వ్యక్తి నాని కలిసి ప్రణాళిక ప్రకారం తన కుమారుడు సాగర్‌ను గంజాయి కేసులో ఇరికించారని, కులంపేరుతో దూషించారని పేర్కొంటూ అతడి తండ్రి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

ఇల్లెందు రూరల్/ టేకులపల్లి, అక్టోబర్ 13 : పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి విప్లవోద్యమానికి తీరని లోటు అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. ఆదివారం ఇల్లెందులోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ, కృష్ణ, మోహన్‌రావు, కిరణ్‌కుమార్ తదితరులు నివాళి అర్పించారు. టేకులపల్లిలో సీపీఎం(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, రామచందర్, వెంకట్రాం, వెంకన్న పాల్గొన్నారు.

కార్మికులకు బోనస్ ఇవ్వాలి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 13 : సోలార్ కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు అబ్దుల్ నబీ అన్నారు. ఆదివారం జీఎం కార్యాలయంలోని సింగరేణి పర్సనల్ మేనేజర్ మోహన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. నాయకులు ప్రేమ్ సింగ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

జేఏసీ కన్వీనర్‌గా లక్కినేని

టేకులపల్లి, అక్టోబర్ 13 : మండల రాజకీయ కార్మిక ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్‌గా లక్కినేని సురేందర్‌రావు ఎన్నికయ్యారు. ఆదివారం టేకులపల్లి మండల కేంద్రం లక్కినేని ఇంటి వద్ద రాజకీయ కార్మిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మండల జేఏసీ కన్వీనర్‌గా ఎన్నికైన బీఆర్ఎస్ నాయకుడు, బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. వివిధ పార్టీల నాయకులు డి.ప్రసాద్, వరప్రసాద్, సత్యనారాయణ, ఈరు, కృష్ణ, సుందర్, శివనాయక్, వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.

'ఆలపాటి'కి పరామర్శ

అశ్వారావుపేట, అక్టోబర్ 13 : అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న రాజకీయ సీనియర్ నాయకుడు ఆలపాటి రామ్మోహనరావు(రాము)ను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. అశ్వారావుపేటలోని రాము స్వగృహంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని ఆకాక్షించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు తాళం సూరిబాబు, హరి, గంధం ఆనంద్ ఉన్నారు.

క్రీడాకారులకు ఏర్పాట్లు చేయాలి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 13 : కంపెనీ స్థాయి క్రీడలకు వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15, 16 తేదీల్లో వైసీవోపీ క్లబ్, 24 ఏరియా, సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో కంపెనీస్థాయి బాస్కెట్ బాల్, లాన్ టెన్నిస్ క్రీడలు ప్రారంభం కానున్నాయన్నారు. ఆరు రీజియన్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారు.

ఉద్యమాలు నిర్వహించాలి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 13 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవాలంటే బలమైన కార్మిక ఉద్యమాలు చేపట్టాలని ఇప్టూ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్‌షావలి అన్నారు. ఆదివారం ఇల్లెందు ప్రధాన కూడలిలో టీయూసీఐలోకి ఇప్టూ విలీనం అవుతున్న సందర్భంగా వాల్‌రైటింగ్ నిర్వహించారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే విలీనసభకు కార్మికులందరూ అధికసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. వెంకన్న, వెంకటేశ్వర్లు, వీరన్న, శేషయ్య, బోస్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 13: ఈ నెల 14న సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతులు/ఫిర్యాదులను రాతపూర్వకంగా ఇవ్వాలని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు 'ప్రజావాణి' ప్రారంభమవుతుందని తెలిపారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్యేలు

లక్ష్మీదేవిపల్లి/ టేకులపల్లి, అక్టోబర్ 13: మండలంలోని హేమచంద్రాపురం గ్రామస్తురాలు కల్లోజి జయమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. ఆమె కుమారుడైన టీయూడబ్ల్యూజే(143) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య, పలువురు నాయకులు పరామర్శించారు. జయమ్మకు నివాళులర్పించారు.

విద్యుత్ యూనిట్లతోనే పాల్వంచ అభివృద్ధి

పాల్వంచ రూరల్, అక్టోబర్ 13: పట్టణంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్ల నిర్మాణంతో పాల్వంచ మరింతగా అభివృద్ధి అవుతుందని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు చారుగుండ్ల రమేష్ అన్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. పట్టణంలో ఆదివారం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాల్వంచ భవిష్యత్ అభివృద్ధికి కెటీపీఎస్‌లో యూనిట్ల నిర్మాణం అవసరమని అన్నారు. పరిశ్రమలు ఉంటేనే ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని అన్నారు.

స్కూల్ ఏర్పాటు చేయాలి

పాల్వంచ రూరల్, అక్టోబర్ 13: జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని సేవాలాల్ రైతు సేన జిల్లా నాయకుడు గుగులోత్ భద్రు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పాండురంగాపురంలో ఆదివారం సేవాలాల్ సేన విద్యార్థి విభాగం సమావేశంలో ఆయన మాట్లాడారు. నగేష్, పవన్ కల్యాణ్, నూనావత్ రాజు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులు పంపిణీ

ఆళ్ళపల్లి, అక్టోబర్ 13: జ్వరం వచ్చి తగ్గిన తర్వాత తీవ్రమైన కీళ్లు, కాళ్లు, ఒంటి నొప్పులతో బాధపడుతున్న మండల వాసులకు ఆయుర్వేద మందులను వ్యాపారవేత్తలు గౌరిశెట్టి శ్రీనివాసరావు, మహమ్మద్ అబ్దుల్ హకీం ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. వారిని పాత్రికేయులు సన్మానించారు.

ఇల్లు దగ్ధం

భద్రాచలం, అక్టోబర్ 13: భద్రాచలం అశోకనగర్ కాలనీలో ఆదివారం ఇల్లు దగ్ధమౌఐంది. ఈ కాలనీ నివాసి బల్లారి రమ్య, దసరా సందర్భంగా పూజా మండపం వద్ద దీపారాధన చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికి, కుటుంబీకులంతా ఆరుబయట ఉన్నప్పుడు ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగాయి. గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకున్నాయి. మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తెచ్చారు.

నేడు కంటి వైద్య శిబిరం

భద్రాచలం, అక్టోబర్ 13: భద్రాచలంలోని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం కంటి వైద్య శిబిరం ఉంటుందని అధ్యక్షుడు బండు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగులతోపాటు రేషన్/ఆరోగ్యశ్రీ కార్డ్ ఉన్న వారు కూడా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చని సూచించారు.

నేడు 'గిరిజన దర్బార్'

భద్రాచలం, అక్టోబర్ 13: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం 'గిరిజన దర్బార్'ను పీవో బి.రాహుల్ నిర్వహిస్తారు. గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 13: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పాత కొత్తగూడేనికి చెందిన దీపక్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. దీపక్ దంపతుల మధ్య విభేదాలతో దూరం ఏర్పడింది. రెండు నెలల క్రితం విడాకులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తీవ్రంగా మనస్తాపానికి లోనైన దీపక్, ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తగూడెం వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిని మింగిన 'తాలిపేరు'

చర్ల, అక్టోబర్ 13: రెండ నిండు ప్రాణాలను తాలిపేరు బలిగొంది. మండలంలోని గన్నవరం కాలనీకి చెందిన గట్టుపల్లి జంపన్న(21), సోయం మహేధర్(17) శనివారం బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు తాలిపేరు నదిలోకి దిగారు. బతుకమ్మలను వదులుతున్నారు. సరిగ్గా వారు నిలుచున్న చోటనే లోతైన మడుగు ఉంది. దీంతో వారిద్దరూ అందులో మునిగిపోయారు. అక్కడకు దగ్గరలోనే నిమజ్జనం సందడిలో ఉన్న గ్రామస్తులు గమనించి, వెంటనే వారిని వెతికి బయటకు తీసి, చర్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిని కాపాడేందుకు డాక్టర్లు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. వారిద్దరూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం మార్చురీకి తరలించారు.

విద్యుదాఘాతంతో యువతి మృతి

పినపాక, అక్టోబర్ 13: విద్యుదాఘాతంతో యువతి మృతిచెందింది. ఆమె కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండలంలోని అమరవరం పంచాయతీ జిన్నెలగూడెం గ్రామ యువతి బిజ్జ రజిత(25) ఇంట్లో శనివారం వాటర్ హీటర్ ఆన్ చేసి ఉంది. పొరపాటున ఆమె చేయి ఆ హీటర్‌కు తగిలింది. విద్యుదాఘాతంతో ఆమె మృతిచెందింది. ఆమెకు భర్త ఆదినారాయణ, ఏడేళ్ల లోపు వయసున్న ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వ్యాపారి అదృశ్యం

పాల్వంచ రూరల్, అక్టోబర్ 13: వ్యాపారి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... కిన్నెరసాని రాజాపురం గ్రామస్తుడు మధుసూదన్ కోళ్లు, చేపల వ్యాపారం చేస్తున్నారు. అతడు ఈ నెల 10న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన భార్య శ్రీలత అన్నిచోట్ల ఆరా తీసినప్పటికీ, గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. తన భర్త కనిపించడం లేదంటగూ ఆమె ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రిజర్వ్ ఫారెస్టులో 'సెప్టిక్' వ్యర్థాలు

రామవరం, అక్టోబర్ 13: సెప్టిక్ ట్యాంకర్ల డ్రైవర్లు సేకరించిన వ్యర్థాలను ఎక్కడో దూరంగా కాకుండా రిజర్వ్ ఫారెస్ట్‌లో, జీకేవోసీ వ్యాలీ రోడ్డు పక్కన పారబోస్తున్నారు. వీటి నుంచి వస్తున్న దుర్వాసనతో అటుగా వెళ్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రావణ్‌ను 'నమస్తే' వివరణ కోరగా.. ''మా దృష్టికి ఈ అంశం ఇప్పటివరకూ రాలేదు. దీనిని డీఆర్‌వోకు తెలుపుతాను'' అని చెప్పారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE

★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

CHANGE OF NAME

★I, Mohammad husamoddin (Old Names) S/o. Mohammad Ekramoddin, R/o.H.No.6-4-101, Street : Arfathpura, Mandal: KORATLA-505326, District Jagtial, Telangana, Have Changed My Name as MOHAMMAD HUSSAM UDDIN
NTK-325721

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616